క్లుప్తంగా

భద్రతా పనుల పరిశీలన



తొట్లకొండపై పరిశీలిస్తున్న స్పెషల్ బ్రాంచి ఏసీపీ గోవిందరాజు

కొమ్మాది: నగరంలో జరగనున్న జీ – 20 సదస్సు నేపథ్యంలో పర్యాటక ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్పెషల్ బ్రాంచి ఏసీపీ గోవిందరాజు మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు భీమిలి బీచ్ రోడ్డు, మంగమారిపేట వద్ద గల తొట్లకొండపై ఆయన పర్యటించారు. భద్రతా పనులు, కొండపై గల మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట పురావస్తు శాఖ ఏడీ వెంకటరావు, తదితరులు ఉన్నారు.

దురలవాట్లతో అనారోగ్యం



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆనందపురం : దురలవాట్లతో అనారోగ్యానికి గురవుతారని, అలాంటి వాటికి దూరంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సహనాజ్ సాదియా సూచించారు. మండలంలోని గొట్టిపల్లిలో మంగళవారం సైక్లోథోన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాదియా మాట్లాడుతూ పొగాకు, గుట్కా, ఖైనీ వంటివి సేవించడం వల్ల క్యాన్సర్ వంటి రోగాలకు గురవుతారన్నారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించడం సాధ్యమేనని చెప్పారు. ఈ సందర్భంగా గొట్టిపల్లి వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.స్వరాజ్యం, పి.స్వర్ణలత, ఆరోగ్య కార్యకర్తలు జి.సింహాచలం, నగేష్ పాల్గొన్నారు.


రుషికొండలో 'గుట్టు చప్పుడు' చిత్రీకరణ



నటీనటులకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు మణీంద్రన్

కొమ్మాది: రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. డాన్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మణీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న గుట్టు చప్పుడు అనే సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. సీనియర్ నటుడు బ్రహ్మాజీ కుమారుడు సంజయ్ రాజ్ (ఓ పిట్ట కథ ఫేమ్), నూతన నటి ఐషా ఖాన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను మరో నాలుగు రోజుల పాటు విశాఖ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తామని నిర్మాత లివింగ్‌స్టన్ తెలిపారు.

కళాధరరావుకు అభినందనలు



కళాధరరావును అభినందిస్తున్న దుర్గా ప్రసాద్

మధురవాడ: ఆర్టీసీలో సేవలు అందిస్తూ యోగాలో విశేషంగా రాణిస్తున్న మధురవాడకి చెందిన యోగా గురువు కళాధరరావును గ్లోబల్ వరల్డ్ రికార్డు వరించింది. యోగోత్సవ అవార్డును ఆన్‌లైన్‌లో అందజేశారు. గ్లోబల్ వరల్డ్ రికార్డ్ సంస్థ గత నెలలో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో వజ్రాసన – శంఖు ముద్రలో 58 నిమిషాలు ఉన్నందుకు రికార్డు వచ్చింది. అలాగే వరుసగా 12 ఏళ్లుగా యోగాలో విశేష సేవలు అందిస్తున్నందుకు బెంగళూరు శివ జ్యోతి యోగా కేంద్రం వారు యోగోత్సవ అవార్డు అందజేశారు. దీంతో ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గా ప్రసాద్ అభినందించారు.

రైతులకు న్యాయం చేయాల్సిందే

సాగుదారులకు, ఇనాందారులకు 2 : 1 పద్ధతిలో భూములు కేటాయించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి

తగరపువలస: వందేళ్లుగా సాగులో ఉంటున్న రైతులకు, ఇనాం భూముల యజమానులకు 2:1 పద్ధతిలో భూములపై శాశ్వత హక్కులు కల్పించాలని భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీ రైతులు ఆర్డీవో పి.భాస్కరరెడ్డిని కోరారు. 2005 – 06లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భీమిలి మండలంలోని మజ్జివలస పంచాయతీలో ఇనాం భూములపై ఇదే పద్ధతిలో హక్కులు కల్పించినట్టు గుర్తు చేశారు. నారాయణరాజుపేట పంచాయతీ కార్యాలయంలో 431 ఎకరాల ఇనాం భూముల సెటిల్‌మెంట్‌కు సంబంధించి మంగళవారం నిర్వహించిన గ్రామసభలో రైతుల తరఫున సర్పంచ్‌లు కాద సూర్యానారాయణ, గాడు వెంకట నారాయణ, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. పన్నెండేళ్లు దున్నేవాడిదే భూమి అని గతంలో ఉన్నత న్యాయస్థానం, ప్రభుత్వాలు స్పష్టం చేశాయన్నారు. గతంలో కొందరు తహసీల్దార్లు పంచాయతీలో ఇనాం భూముల సర్వే చేపట్టకుండానే చేసినట్టుగా ఇనాం హక్కుదారులతో కలిసి ఇక్కడి రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఆ భూములను వందల సంఖ్యలో చిన్నకారు రైతులు ఇప్పటికీ సాగు చేసుకోవడంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం నుంచి రైతుభరోసా సాయం, గతంలో బ్యాంకుల నుంచి కౌలుకార్డుల ద్వారా రుణాలు పొందారన్నారు. రైతులకు న్యాయం జరగకపోతే ప్రాణత్యాగాలకు కూడా వెనుకాడబోమన్నారు. ఎప్పుడో దారాదత్తం చేసిన 40 ఎకరాల చాకిరీ ఇనాం భూములు విక్రయాలు జరిగిపోయినా ఇప్పటికీ ఇనాం హక్కుదారుల పేరుతో ఉండటాన్ని తప్పుపట్టారు.

సర్వే ముగిశాక మరోమారు గ్రామసభ

ఈ సందర్భంగా ఆర్డీవో భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి ఇనాం భూముల రైత్వారీ పట్టాలు ఒకరి పేరుతో ఉండగా... ప్రస్తుతం భూములను వేరొకరు సాగు చేస్తుండడం ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఇప్పటి వరకు రైత్వారీ పట్టాలపై అభ్యంతరాలు రాలేదన్నారు. ఎండోమెంట్ భూములు దేవుని పేరుతో ఉంటాయని, వీటిలో వ్యవసాయం తప్ప భవనాలు నిర్మించడం, రైతులకు కౌలుకార్డులు ఇవ్వడం జరగదన్నారు. రైతులు తమ వద్ద ఉన్న రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ లేదా సాగులో ఉన్నట్టు ఏదైనా డాక్యుమెంట్ సమర్పిస్తే థర్డ్ పార్టీ విచారణ చేపడతామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం వారం రోజుల పాటు పంచాయతీలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, ముగ్గురు వీఆర్వోలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సర్వే ముగిసిన తర్వాత మరోమారు గ్రామసభ నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ మాట్లాడుతూ ఇనాం భూముల సర్వేకు రైతులంతా సహకరించాలని కోరారు. వారికి అవసరమైన సహాయం అందించడానికి తమ సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రామసభలో కంటుబుక్త వెంకన్న, కోరాడ శంకర్, కనకల వెంకటరమణ, గాడు తాతినాయుడు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు 15 పోలింగ్ కేంద్రాలు

చంద్రంపాలెంలో పరిశీలించిన తహసీల్దార్ రమణయ్య



చంద్రంపాలెం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న రూరల్ తహసీల్దార్ రమణయ్య

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు విశాఖ రూరల్ మండలంలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ సనపల రమణయ్య చెప్పారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల్లోని కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో సాగర్‌నగర్ స్టెల్లా మేరీ స్కూల్లో 3, తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో 6, చంద్రంపాలెం హైస్కూల్లో 6 కలిపి మొత్తంగా 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇప్పటికి వరకూ మండలంలో 15,029 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, సోమవారం వరకు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించినందున మిగిలిన వారి పేర్లు తుది జాబితాలో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కే ప్రవీణ్‌కుమార్, ఎన్నికల డీటీ సుధాకర్, చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎమ్.రాజబాబు, వీఆర్వోలు సూరిబాబు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల స్థితిగతులపై క్షేత్రస్థాయి పరిశీలన



వేములవలసలో సీలింగ్ భూముల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

ఆనందపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో గతంలో భూ గరిష్ఠ పరిమితి చట్టం (సీలింగ్ యాక్ట్) కింద స్వాధీనం చేసుకొని పేదలకు పంచి పెట్టిన భూముల స్థితిగతులపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వం ఏ ఆశయంతో గతంలో భూములను పేదలకు పంచి పెట్టిందో ఆ పరిస్థితి నేడు ఉందా..? లేదా..? అన్న విషయమై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ మేరకు మండలంలోని వేములవలస, వెల్లంకి గ్రామాల్లో గతంలో పేదలకు అందించిన సీలింగ్ భూములను ఆర్డీవో భాస్కరరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ రెండు గ్రామాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఎకరా సుమారు రూ.5 కోట్లు వరకు ధర పలుకుతోంది. కాగా వేములవలస సర్వే నంబరు 39 – 1, 39 – 5, వెల్లంకి గ్రామంలో సర్వే నంబర్లు 235 – 9, 263 – 1, 263 – 2, 263 – 3, 264 – 2, 264 – 5, 264 – 16లలో సుమారు 25 ఎకరాలు పెద్దల నుంచి స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేసి డి పట్టాలను అందజేశారు. కాగా ఆ భూములు అన్యాక్రాంతమైనట్టు గత కొంత కాలం నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం నుంచి పట్టాలు ద్వారా పొందిన భూములు పేదల వద్దే ఉన్నాయా..? లేక అన్యాక్రాంతమయ్యాయా..? అని సర్వే నంబర్లు వారీగా ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించారు. ప్రస్తుత స్థితిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించడానికి నిర్ణయించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ లోకవరపు రామారావు, ఆర్ఐ మణికంఠ, మండల సర్వేయరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో పారిశుధ్యం మెరుగు



ర్యాలీలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ బాధ్యతతో తమకు సహకరిస్తే స్వచ్ఛ నగరం సాకారమవుతుందని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరిచేరవన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా అందివ్వాలని సూచించారు. నిషేధిత పాలిథిన్ కవర్లను వినియోగించవద్దని సూచించారు. ఎవరైనా వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



భీమిలి ఆర్డీవో కార్యాలయంలో సమావేశమైన అధికారులు

తగరపువలస: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భీమిలి ఆర్డీవో పి.భాస్కరరెడ్డి ఆదేశించారు. భీమిలి ఆర్డీవో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ అధికారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడపిల్లల నిష్పత్తి వెయ్యికి 943 ఉండగా జిల్లాలో 989 ఉందన్నారు. ఇది నూరుశాతానికి చేరుకోవాలన్నారు. తక్కువ నిష్పత్తి ఉన్నచోట అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి గర్భస్రావాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, నోడల్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డీఎఫ్‌ఎంవోలు ఉమావతి, నాగేశ్వరరావు, భీమిలి ఎస్ఐ గంటా హరీష్, గైనకాలజిస్ట్ లావణ్యకుమారి, ఎన్జీవో సిబ్బంది సుబ్బలక్ష్మి, అమిత్, రాఘవ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సర్వీసు రోడ్లు

పీఎం పాలెం: క్రికెట్ స్టేడియం వద్ద నుంచి కారుషెడ్ కూడలి వైపునకు వచ్చే జాతీయ రహదారి సర్వీసు రోడ్లలో చీకటి పడితే అంధకారం రాజ్యమేలుతోంది. ఈ రోడ్లలో పీఎంపాలెం, ధర్మపురికాలనీ, పాత పీఎం పాలెం వెళ్లేందుకు పులువురు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. వీధి దీపాలు వెలగకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చెట్టు కొమ్మలు తొలగింపు

భీమునిపట్నం: భీమిలి మెయిన్ రోడ్డులోని గ్రామదేవత శ్రీనూకాలమ్మ అమ్మవారి చదును పట్టు ప్రాంతంలో ఉన్న భారీ చెట్టు కొమ్మలను మంగళవారం తొలగించారు. ఏటా ఉత్సవాల సమయంలో అమ్మవారి గరగను ఊరేగించిన తర్వాత కొద్ది రోజులపాటు ఈ చదునుపట్టు వద్ద ఉంచుతారు. భక్తులు రోజూ దర్శించుకుటారు. అయితే ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోడంతో అందరికీ ఇబ్బందికరంగా ఉంటోంది. దీంతో ఈ చదునుపట్టు ప్రాంతంలో అవసరమైన వసతులు కల్పించాలని అభివృద్ధి కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా దీనికి అనుకుని ఉన్న భారీ వృక్షం కొమ్మలు ప్రమాదకరంగా ఉండడంతో వాటిని తొలగించారు. తదుపరి అవసరమైన పనులు చేపడతారు. ఈ పనులు పూర్తయితే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

మహా శివరాత్రికి ఏర్పాట్లు

పీఎం పాలెం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పీఎం పాలెం – బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకరమఠం శివాలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు మఠం గౌరవ ధర్మాధికారి జె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయంలో ఈ నెల 18న తెల్లవారుజాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఉమా సిద్ధేశ్వర స్వామికి ఏకవారాభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ రుద్రహోమం చేయిస్తామన్నారు. కారుషెడ్ శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్

మధురవాడ: బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైతన్య విద్యా సంస్థల రీజినల్ డైరెక్టర్ అహ్మద్ ఆలీ, ప్రిన్సిపాల్ సందీప్, ఏజీఎమ్ సురేష్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

తగరపువలస: భీమిలి రహదారిలో చిల్లపేట శివారు ఉప్పు గల్లీ జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. భీమిలి, తగరపువలస నుంచి ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి ప్రమాదం జరిగిన ఆటోలోనే క్షతగాత్రురాలిని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. క్షతగాత్రురాలి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇ – క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలు



శింగనబందలో వరి సాగును పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మణమూర్తి

తగరపువలస: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఇ – క్రాప్‌తోనే ముడిపడి ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.లక్ష్మణమూర్తి అన్నారు. ఆయన భీమిలి డివిజన్‌కు చెందిన శింగనబంద, పెంట, బోని పంచాయతీల్లో సోమ, మంగళవారాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పంట వివరాల నమోదు జాబితా, సర్వే నంబర్, సాగులో ఉన్న పంట రకం, నీటి లభ్యతను రైతుల సమక్షంలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రబీ – 2022కు భీమిలి డివిజన్‌లో 4,160 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 579 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసినట్లు నమోదు చేశారన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ – పంట వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఆయనవెంట భీమిలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు బి.విజయప్రసాద్, మూడు మండలాల వ్యవసాయాధికారులు ఎంవీ చలం, సంధ్యారత్నప్రభ, బి.శివ కోమలి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఏసీపీ చుక్కా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

మధురవాడ: శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులు చక్కగా చదవాలని విశాఖ నార్త్ జోన్ ఏసీపీ చుక్కా శ్రీనివాసరావు సూచించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సంస్థ 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు 870 పుస్తకాలు సుమారు రూ.1.66 లక్షలతో సమకూర్చింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ఇటువంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు మరింత క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. రిటైర్డ్ పోలీసు అధికారి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజబాబు, జయప్రద, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుడుమూరి మీనా తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధితో విద్యార్థులకు మేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఆనందపురం : విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపుదలకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం దోహదపడుతుందని యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్ అన్నారు. మండలంలోని బోని, శిర్లపాలెం, గొట్టిపల్లి హైస్కూళ్లలో అమలు చేస్తున్న కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6, 7, 8, తరగతుల్లో అభ్యసనాభివృద్ధి కోసం నవంబర్ 28 నుంచి కార్యక్రమం కొనసాగుతోందన్నారు. బోధన పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్లుగా విభజించి అమలు చేయడం వల్ల విద్యార్థుల అభ్యసనా స్థాయి గణనీయంగా మెరుగవుతోందన్నారు. పరీక్షలు నిర్వహించి వాటిలో వచ్చిన తేడాలను గమనించి సరి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠ్యాంశాల ప్రణాళికలను పరిశీలించారు. కార్యక్రమం అమలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ ఎం.ఎస్.ఆర్.శర్మ, విజయనగరం డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతి నాయుడు, స్టేట్ రీసోర్స్ గ్రూప్ మెంబర్ రాంబాబు, హెచ్‌ఎంలు బి.అప్పలరాజు, శారద, రుత్తల సన్యాసిరావు పాల్గొన్నారు.

లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పరిశీలన

పద్మనాభం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) పరిశీలనకు రాష్ట్ర బృందం మంగళవారం మండలంలో పర్యటించింది. పద్మనాభం, మద్ది, రెడ్డిపల్లి హైస్కూళ్లతోపాటు పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. 6, 7, 8 తరగతులను బోధిస్తున్న ఉపాధ్యాయుల టీచింగ్ ప్రాక్టీస్ తరగతులను పర్యవేక్షించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. లిప్ పథకం అమలును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు.

అమర సైనికులకు ఘన నివాళి



మధురవాడలో కొవ్వొత్తుల ర్యాలీలో విద్యార్థులు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కేథరిన్ విద్యార్థులు

కొమ్మాది: పుల్వామా ఉగ్రదాడిలో మృతి చెందిన సైనికులకు జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. ఫిబ్రవరి 14 అంటే ప్రేమికుల దినోత్సవానికి ప్రాధాన్యమివ్వడం కాదని, ఆత్మాహుతి దాడిలో వీర మరణం పొందిన 40 మంది సైనికులకు నివాళులర్పించి, వారి ఖ్యాతిని నేటి తరానికి తెలియజేయాలన్నారు. ర్యాలీలో ఎన్‌సీసీ ఆఫీసర్ సీహెచ్ హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

మధురవాడ: పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన అమరవీరులకు మధురవాడలో మంగళవారం సాయంత్రం అమ్మ ఒడి అనాథ, వీధి బాలలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధాత్రి ఫౌండేషన్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో నడుస్తున్న సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో విశాలాక్షి తదితరులు బాలలకు పుల్వామా దాడిని వివరించారు. పిల్లల్లో దేశంభక్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.



నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అమరవీరులకు కేథరిన్ విద్యార్థుల నివాళి

తగరపువలస: ముష్కరుల దాడిలో అమరులైన సైనికులకు భీమిలి కేథరిన్ విద్యార్థులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనాటి దాడిని విద్యార్థులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఈ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉగ్రదాడులను నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి వీర జవాన్లకు నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని కరస్పాండెంట్ ఆలీవర్ ఆర్ రాయి సూచించారు. విద్యార్థుల ప్రదర్శనను డైరెక్టర్ సుష్మా ఇవాంజిలీన్, చీఫ్ కో ఆర్డినేటర్ సౌజన్య సాయి అభినందించారు.

● జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వీర జవాన్లకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఆర్.అప్పలరాజు, ఎస్.రమేష్, బి.మల్లిక, పి.నాగమణి పాల్గొన్నారు.

అనిట్స్‌లో అవగాహన సదస్సు



ముఖ సంబంధిత లోపాలపై అవగాహన కలిగిస్తున్న వైద్య నిపుణులు

తగరపువలస: అంతర్జాతీయ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ దినోత్సవం సందర్భంగా సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో ముఖం, నోరు, దవడ సంబంధిత లోపాలపై మంగళవారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో తగిలే గాయాల పట్ల కూడా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు కళాశాలలో నిర్వహించిన వర్క్‌షాపులో ముఖం, నోరు, దవడకు సంబంధించి అంతర్జాతీయ వైద్య నిపుణులు సూజీ, కెమిలో ఎస్టోబెన్ దవడ జాయింట్ మార్పిడి, అధునాతన శస్త్ర చికిత్సపై అవగాహన కలిగించారన్నారు. కార్యక్రమంలో చెన్నై మీనాక్షి విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.ఎస్.నీలకందన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్, వైద్య నిపుణులు ఫణికుమార్, దర్శన్, భార్గవ్, మోటూరి కిషోర్, దల్సింగ్, ప్రీతిభార్గవ్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

'గీతం'లో టీసీఎస్ బృందం

కొమ్మాది: ఐటీ సంస్థ టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మానవ వనరుల నియామకపు నిపుణుల బృందం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని మంగళవారం సందర్శించింది. వీసీ దయానంద సిద్దవట్టం, రిజిస్ట్రార్ గుణశేఖరన్‌తో బృందం సమావేశమయ్యారు.